❖•❖•❖ 57 ❖•❖•❖

# అరిమతయియ యోసేపు

*"ఆ దినము సిద్ధపరచు దినము, అనగా, విశ్రాంతి దినమునకు పూర్వదినము, గనుక సాయంకాలమైనప్పుడు, అరిమతయియ యోసేపు తెగించి, పిలాతునొద్దకు వెళ్లి యేసు దేహము తనికిమ్మని యడిగెను. అతడు ఘనత వహించిన యొక సభ్యుడై, దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచువాడు; పిలాతు ఆయన ఇంతలోనే చనిపోయెనా అని ఆశ్చర్యపడి యొక శతాధిపతిని తన యొద్దకు పిలిపించి, ఆయన ఇంతలోనే చనిపోయెనా అని అతని నడిగెను. శతాధిపతివలన సంగతి తెలిసికొని, యోసేపునకు ఆ శవము నప్పగించెను. అతడు నారబట్ట కొని, ఆయనను దింపి, ఆ బట్టతో చుట్టి, బండలో తొలిపించిన సమాధియందు ఆయనను పెట్టి, ఆ సమాధి ద్వారమునకు రాయి పొర్లించెను. మగ్దలేనే మరియయు యోసే తల్లియైన మరియయు ఆయన యుంచబడిన చోటు చూచిరి" (మార్కు 15:42-47).*

యేసు మరియు దొంగల శవముల శుక్రవారము మొదలుకొని శనివారమంతా వారి సిలువలపైనే విడిచిపెట్టబడి యుండకూడదని యూదులు నాయకులు ఆశించారు. ఎందుచేతనంటే వారు – ద్వితియోపదేశకాండము 21:22, 23 వచనముల సహాయంతో – శవములను సిలువలపైనే విడిచిపెట్టి యుంచుటవలన దేశము, సబ్బాతు దినము, మరియు సమీపించుచుండిన పస్కా సహితము అపవిత్రపరచబడునని నమ్మారు. గనుక వారు పిలాతు నొద్దకు వెళ్లి సిలువలపై వ్రేలాడుచుండిన వారి శవములు అక్కడనుండి తొలగించబడునట్లు

వారి కాళ్లను విరుగగొట్టుట ద్వారా వారి ప్రాణములను తీసివేయవలెనని అడిగారు (యోహాను 19:31). పిలాతు వారి కోరికను మన్నించాడు. రోమా సైనికులు, వారిని చంపిన తదుపరి, శవములను క్రిందికి దింపి వాటిని పారవేయుదురు లేదా ఏదో ఒక సామాన్య సమాధులున్న చోట పాతిపెట్టుదురని యూదులు అనుకొనియుందురు. కనీసము, శవములను దింపివేసి అవి పాతిపెట్టబడునట్లు యూదులు ఏమైనా యోచించియుంటారా అని చెప్పుటకు రుజువు సువార్తల వాక్యభాగములలో లేదు.

వారి బంధువులు సిలువవేయబడిన నేరస్థుల శవములను తీసికొని వాటిని పాతిపెట్టుటకు రోమా ప్రభుత్వ చట్టము వారికి అనుమతినిచ్చింది. యేసు బంధువులు గలిలయులు, మరియు యూదుల భయమునుబట్టి కావచ్చు లేదా యెరూషలేములో సమాధి లేకుండుటనుబట్టి కావచ్చు, వారు ఆయన శరీరము కావలెనని కోరలేదు అపొస్తలులు కూడా గలిలయులైనను రక్తసంబంధులు కానందువలన, పిలాతు యేసు శరీరమును వారికి అప్పగిస్తాడను నమ్మకము లేదు. కాబట్టి, యేసు శరీరము ఎటువంటి గౌరవమర్యాదలతోనైనా పాతిపెట్టబడవలసియుంటే, ఎవరో మరొకరు, ఆయన బంధువులకుగాని, అపొస్తలులకుగాని, మరియు గలిలయులైన శిష్యులకుగాని పరిచయములేనివారు, ఆ పని చేయాల్సి వుంటుంది.

ఆయన అశ్చర్యకరమైన తన అనుగ్రహము చొప్పును, ఆయన కుమారుడు సకల మర్యాదలతో సమాధిచేయబడు సౌకర్యమును సమకూర్చుటకు దేవుడు ఒకరిని సంసిద్ధంచేసి యుంచాడు. ఆయన పేరు యోసేపు. ఆయన ఎక్కడో మారు మూలలో ఉన్న అరిమతయియ అను యూదా పట్టణమునకు చెందినవాడు. ఆయన యూదా మతపరమైన విషయములలో పురోగమించిన ఒక యూదుడును యూదుల మహా సభలో సభ్యుడునై యుండెను (మార్కు 15:43ఎ; లూకా 23:50). అభివృద్ధితోను, పట్టుదలతోను, మరియు విద్యాభ్యాసముతోను, ఆయన ఏ యూదుడైనను ఎప్పుడైనను సాధించగల అత్యున్నత పదవిలో నున్న ఉత్తముడైయుండెను. ఏ యూదునికైనను యూదుల మహా సభలో వర్తమాన సభ్యుడై యుండుట కష్టమయ్యే పనే. వీటన్నిటికి తోడుగా, బహుశ ఆయన ప్రజలపై కలిగియుండిన అధికార హోదా మరియు ప్రభావమునుబట్టి కాబోలు ఆయన ధనవంతులలో ఒకడుగా గుర్తింపు పొందియుండెను. ఆయన ఎంతో శ్రమించి తానున్న ఉన్నత పదవిని అలంకరించినవాడని ఏ యూదుడైనను ఆయనను పరిగణించును.

యేసు మరణించిన కొద్దిసేపటికి, అంత వరకు కనుమరుగైయుండిన ఈయన బయటికి వచ్చి పిలాతు నొద్దకు వెళ్లి యేసు దేహమును పాతిపెట్టుటకు అనుమతినిమ్మని అడిగాడు. ఈయన యూదుల మహా సభ సభ్యుడు గనుక అది ఆయనకు పిలాతుతో సమానమైన అధికార స్థాయిని చేకూర్చి యుండును. మనవి చేయబడిన తరువాత, యేసు మరణించాడని పిలాతు ధ్రువపర్చుకొని, యోసేపుకు అనుమతినిచ్చాడు. యోసేపు యేసు దేహమును సిలువ మీద నుండి క్రిందకు దింపి, ఆయన కొని తెచ్చిన నారబట్టతో చుట్టి తన సొంత సమాధి వరకు మోసికొనిపోయి, నీకొదేము సహాయంతో, సుగంధ ద్రవ్యములు పూసిన తరువాత ఆ దేహమును సమాధియందుంచాడు.

అరిమతయియ యెసేపు ఏ మానవుడైనా చేయలేని అత్యంత గంభీరమైన ఘనకార్యమొకటి చేశాడని మనము ఎటువంటి సంకోచమైనను లేకుండా చెప్పవచ్చును – ఆయన మన ప్రభువు దేహమును పాతిపెట్టాడు! యేసు మన పాపముల కొరకు మరణించిన పిదప, యోసేపు

యేసు దేహమును తీసికొని, భయభక్తులతోను యోచనపూర్వకంగాను, యేసు భౌతికంగా మరలా ఆదివారము ఉదయాన పునరుత్థానుడగునంత వరకు సమీపమందుండిన సమాధిలో ఉంచాడు. ఒక మానవుడు చేయగల ఇంత కంటె ఎక్కువ మనోహరమైన కార్యము చేయవలెనని ఎవరూహించుకొనగలరు! మత్తయి 26:13ను మనము మనకు అనుకూలింపజేసికొనుచు, "సర్వలోకమందు ఈ సువార్త ఎక్కడ ప్రకటింపబడునో, అక్కడ ఈయన చేసినదియు ఈయన జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడును" అని ఇతని గూర్చి చెప్పవచ్చును.

మనము అనుకరించవలసిన అంశము ఈయన గూర్చినది ఏదైనా ఉన్నదా? ఖచ్చితంగా ఆయనలో కూడా ఏవో బలహీనతలు ఉండియుంటాయి, కానీ ఆయనలో ప్రశంసయోగ్యమైన ప్రత్యేకలక్షణాలు కూడ ఉంటాయి. మనము ఆయనను శ్లాఘించుచు ఆయన శీలము నేర్పించు పాఠమలను నేర్చుకొందాము.

*ఆయనలో శిష్యత్వ ప్రత్యేక లక్షణముండినది.* ఆయన యేసు శిష్యుడై యుండెను. "యేసు శిష్యుడుగా నున్న అరిమతయియ యోసేపు" అని మత్తయి ఆయన గూర్చి వ్రాశాడు (మత్తయి 27:57). ఆయన ఒక రహస్య శిష్యుడై యుండెననునది కూడా నిజమే (యోహాను 19:38ఎ), కానీ యేసు మరణము తరువాత, యేసు శిష్యుడని ఆయన ధైర్యంతో ప్రజల్లోకి బహిరంగంగా వచ్చాడు. ఆయన, ఎక్కడో ఒక చోట, ఏదో ఒక విధంగా, యేసు దైవత్వమును గూర్చిన రుజువును విన్నాడు. ఈ సత్యమునకు ఆయన తన హృదయముతో విలువకట్టాడు మరియు దానిని అంగీకరించాడు. ఆయన యేసు వశమయ్యాడు మరియు యేసును తన యజమానునిగా చేసికొన్నాడు.

*ఆయనలో ఎదురుచూపుగల ప్రత్యేక లక్షణముండినది.* దేవుని రాజ్యము ఆయన హృదయాన్ని బంధించివేసింది. "అతడు ... దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచువాడు" అని ఈయన గూర్చి మార్కు చెప్పుచున్నాడు (మార్కు 15:43) దేవుని రాజ్యము సమీపించియున్నదని యేసు బోధించుట ఖచ్చితంగా వినియుంటాడు. ఈ ఆలోచన ఆయనలో సంభ్రమాశ్చర్యములు కలుగజేసింది గనుక ఆయన హృదయము ఎదురుచూచు లక్షణముగలదైనది. "నేను ఆ రాజ్యం కోసం వెదకి వేచియుండి అది వచ్చినప్పుడు దానిని పొందుకొంటాను" అని తనలోతాను అనుకొన్నాడు.

*ఆయనలో మంచితనము మరియు నీతియను ప్రత్యేక లక్షణములుండినవి.* మంచితనము మరియు నీతి యను శ్రేష్ఠమైన లక్షణాలు ఆయన స్వభావములో ఒక దానితో నొకటి అల్లుకపోయాయి. ఆయన సుహృదయుడు మరియు నీతిమంతమైన జీవితం జీవించాడు ఆయన హృదయం యేసు బోధలు వినుటకు నూరంతలుగా ఫలించిన మంచి నేలను పోలినదై యుండెను. లూకా ఆయన గూర్చి వ్రాస్తూ "అతడు సజ్జనుడును నీతిమంతుడునై యుండెను" అని వివరించాడు (లూకా 23:51బి). ఇంకా, యూదుల మహా సభ చేసిన ఆలోచనకును వారు చేసిన పనికిని ఆయన "సమ్మతింప" లేదని కూడా వ్రాశాడు (లూకా 23:51బి). అతని హృదయములో నుండి నీతి కార్యాలు బయలువెడలినవి, చెడు కార్యాలు కాదు. ఆయన పరలోకము నుండి వచ్చిన నీతిమంతుడైనవాని పట్ల చెడుగా వ్యవహరించుటకు ఆయన యొక్క లోతైన, మరియు ప్రామాణికమైన శీలము ఆయనను అనుమతించలేదు. యూదుల మహా సభ అంతా కలిసి యేసు సిలువవేయబడవలసినదే యను వారి ప్రణాళికను ఉసిగొల్పుటకు యోచించుచుండినప్పుడు ఆయన కూడ అక్కడ ఉండుటకు నిరాకరించియుండును.

*ఆయనలో ఆధ్యాత్మికతయను ప్రత్యేక లక్షణముండినది.* యేసు సిలువ ఆయన మనస్సునే మార్చివేసింది. స్పష్టంగా, యేసు సిలువ వేయబడుచుండగా అనేకులు చూశారు, కానీ వారు వారి మనస్సులు మారకుండానే ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. యేసు పడుచుండిన వేదనను వారు చూశారు, జాగ్రత్తగా గమనించారు, సూచనలు చూశారు, కానీ వారు ఆశ్చర్యముతో రొమ్ముకొట్టుకొన్నారంతే, మరొక ప్రక్కన, సిలువ యోసేపును శాశ్వతంగా మార్చివేసింది. యోసేపు యేసు శిష్యుడై యుండినప్పటికిని, ఆయన "యూదుల భయము వలన రహస్యముగా యేసు శిష్యుడై యుండెను" అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:38). ఏదిఏమైనా, ధ్రువీకరించుచుండిన సిలువ సూచనలన్నీ – యేసు ప్రవర్తించిన తీరు, అంధకారము అలుముకొనుట, మరియు భూమి వణకుట – ఆయన దాగి యుండిన చాటు మాటు చోటు నుండి సమూల శిష్యత్వమును వెలుగు లోనికి వచ్చాడు.

*ఆయనలో సాహసమను ప్రత్యేక లక్షణముండినది.* ఆయన ధైర్యాన్ని కూడగట్టుకొని తన జీవితమును, సిరిసంపదలను మరియు పేరుప్రఖ్యాతలను యేసు పక్షాన నిలిచియుండుటకు ఉపయోగించుకున్నాడు. జీవితంలో అవసరమైన ధైర్యం ఏ ఒక్కరికినీ లేకుండాపోయిన ఒక సమయం వచ్చింది; మనము మన ధైర్యాన్ని కూడగట్టుకోవాలి లేదా దానిని కనుగొనాలి. అవసరమైన ఆ సమయంలో అవసరమైన ఆ సందర్భము నిమిత్తము మనము పురోగమించాలి.

యోసేపు యేసును సమాధిలో ఉంచిన తరువాత అతనేమయ్యాడో అతనికేంజరిగిందో మనకు తెలియదు. లేఖనాలు అతని గూర్చి మరలా పేర్కొనడంలేదు. యూదుల మహా సభలో ఆయనకుండిన ఉన్నత స్థానం నుండి ఖచ్చితంగా తొలగింపబడియుంటాడు. బహుశ యెరూషలేము పట్టణాన్ని విడిచిపెట్టి మారుమూలలో ఉన్న చిన్న గ్రామమైన అరిమతయియకు వెళ్లిపోయి అక్కడే నివసించి యుండవచ్చును. ఆయన చేసిన కార్యము యొక్క ఫలితం ఏమైయుండునో ఆయనకు తెలిసియుండదు; యేసును పాతిపెట్టుట ద్వారా బహిరంగంగా గుర్తింపు పొందుకొనుట వలన అది ఆయనకు తన జీవితమునే మార్చివేయ గుర్తింపోతుందని ఆయన ఎరిగియుంటాడు.

*ఆయనలో భక్తిభావము మరియు గౌరవమను ప్రత్యేక లక్షణాలుండినవి.* సైనికులు యేసు దేహమును దింపి ఆయనతో కూడ మరణించిన ఇద్దరు దొంగలతోపాటు ఆయనను పాతిపెట్టుట యోసేపు జీర్ణించుకోలేకపోయాడు. ఒక మనిషి మరణించినప్పుడు అతని దేహము ఎలా గౌరవమర్యాదలతో పాతిపెట్టబడునో అలాగే యేసు దేహము కూడ పాతిపెట్ట బడవలెనని యోసేపు నిశ్చయపర్చుకోవలసి యుండెను.

ఆయన యేసు దేహమును క్రిందికి దింపి ఖరీదైన నార బట్టలో దానిని చుట్టి స్వంతంగా తన స్వయం కొరకు తొలిపించుకొన్న సమాధిలో పాతిపెట్టాడు. "దానిని క్రిందికి దించి, సన్నపు నారబట్టతో చుట్టి, తొలిచిన రాతి సమాధిలో ఉంచెను. అందులో ఎవడును అంతకు మునుపెప్పుడును ఉంచబడలేదు" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 23:53).

*ఆయనలో ఔదార్యమను ప్రత్యేక లక్షణముండినది.* ఆయన మన ప్రభువుకు అవసరమైన ఆ సమయంలో అవసరమైనదెల్లా ధారాళంగా ఇచ్చాడు. ఇంకెవరునూ ముందుకు రావడంలేదు, గనుక చేయాల్సిన కార్యము యోసేపే చేయాల్సివచ్చింది. దీనంతటికి ఎంతో ఖర్చవుతుందని ఆయన లెక్కలు వేసుకుంటూ కూర్చోలేదు; చేరువలో ఉండిన మహదవకాశాన్ని

చేజిక్కించుకొన్నాడు. యేసు తనకైతాను సమకూర్చుకొను, స్థితిలో లేనప్పుడు ఆయనకు అవసరమైన సమస్తమును సమకూర్చుటకు యోసేపు తన అధికార పదవిని, ఆయన కలిగియున్నవాటిని, పరువుప్రతిష్టలను, సన్నిహితమును మరియు శీలమును సద్వినియోగం చేసికొన్నాడు. ఆయన చేసిన దానికి మనము ఆయనకు ఎల్లప్పుడు వందనస్తులమై యుందుము.

ఇక్కడ మన ముందు ఒక మహా మనిషి ఉన్నాడు. ప్రతి ఒక్కరిలోను ఉండాల్సిన గొప్ప ఆధ్యాత్మిక లక్షణములన్నీ ఆయనలో కలిసివచ్చినవని మనము చూచుచున్నాము. ఆయన యేసు శిష్యుడై యుండెను, దేవుని రాజ్యంతో పట్టబడిన హృదయంగలవాడై యుండెను, సిలువ చేత ఒప్పించబడినవాడును, భక్తిభావము మరియు సకల మర్యాదలు కలిగియుండినవాడును. ఉదారత మరియు దయ కలిగియుండినవాడునై యుండెను. ఎవరును ఇన్ని సుగుణ లక్షణములు గల సౌశీల్యాన్ని ఒకేసారి కలిగియుండలేరు; అతడు సరైన నిర్ణయములు మరియు ఒక సుహృదయము పెంచిపోషింపబడుచుండుట ద్వారా అనుదినం అభివృద్ధిచెందాలి. అప్పుడు ఎటువంటి సంకట సమయము సమీపించిననూ, ఆయన అందురూ జ్ఞాపకముంచుకొనుటకు తళతళలాడే తార్కాణంగా తన తనువు చాలిస్తాడు.

❖◆❖◆❖

*యేసు మన నిమిత్తము సిలువను సహించి మనము ఆయనను వెంబడించవలెనని పిలుపునిచ్చాడు. మన సమస్త భయములను, మన హృదయములలో నుండి సమస్త ఉదాసీనతను, ఆయన నిమిత్తము శ్రమనొందుటకు గల సమస్త ఇష్టములేమిని మనలో నుండి, తొలగించుమని మనము ఆయనను వేడుకొనవలెను. మనము ఆయన సిలువయందు అతిశయించుదము – ఆయన మన కొరకు చేసినదానంతటినిబట్టి అతిశయించుచు మనము ఆయనతో కూడ తన సిలువను మోయుటకు ఆయన మనకిచ్చుచున్న ఆహ్వానమునుబట్టి సహితము అతిశయించుచు, మనము ఆయన ప్రక్కలో వ్రేలాడబడి యుండవలెనని అడిగినా లేక ఆయన దేహమును పాతిపెట్టుమని అడిగినా అన్నిటియందు అతిశయించుదము.*